# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 16 అక్టోబరు, 2026 | పేజీలు :06


## దేశానికి ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం /పటాన్‌చెరు :** దివంగత రాష్ట్రపతి మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ లో గల ఆయన కాంస్య విగ్రహానికి పటాన్చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డి పూల మాల వేసి వినమ్ర నివాళుల అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అత్యంత నిరుపేద కుటుంబం నుండి జీవితాన్ని ప్రారంభించి దేశానికి రాష్ట్రపతి అయ్యారని గుర్తు చేశారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, నాయక్, సీనియర్ నాయకులు పరమేష్, అశోక్, శ్రీదర్ చారి, వృధ్వీరాజ్, వెంకటేష్, ఆశమ్, కొండల్ ,షకీల్, రామ్మోహన్, వీరారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన ఏడుపాయలు!

### బోనాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యేలు....
### అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ దయానంద్

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గమ్మ క్షేత్రంలో శరన్నవరాత్రులు భాగంగా బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. మహాలక్ష్మి రూపంలో కొలువుదీరిన వనదుర్గమ్మనుదర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయరు. పోతారాజుల విన్యాసాలు, మహిళలకోలాట లు అమ్మవారి నామస్మరణలతో బోనాల ఊరేగింపు జరిగింది. గోకుల్ షెడ్ నుండి అమ్మవారి ప్రధానాలయం వరకు బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రధాన ఆలయంలో అమ్మవారి ముందు సమర్పించారు.



### బోనం ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యేలు

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, గొంగిడి సునీత, మాజీ జడ్పీచైర్మన్ తుల ఉమ ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. బోనాల సమర్పణతో సంప్రదాయ భక్తివైభవంఉట్టిపడింది. స్థానిక సర్పంచ్ సుశీలదుర్గయ్య, ఏడుపాయల కార్యనిర్వాహంధికారి వీరేశం, జ్యోతి ప్రజ్వలన చేసే బోనాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళలు 108 బోనాలు ఎత్తుకొని అమ్మవారి మొక్కలు తీర్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మెదక్ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ నరేందర్, పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరమ్ జగన్నాధం, మాజీ ఏడుపాయల చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు గురుమూర్తి గౌడ్, సాయిరెడ్డి, రఘు, లింగారెడ్డి, నాగ్సన్‌పల్లి శ్రీనివాస్ గౌడ్, సంజీవ రెడ్డి, అనిల్ రెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ, ప్రతాప్ రెడ్డి, రవి, నర్సింలు, యాదగిరి, రాజు, బ్రహ్మచారి వివిధ గ్రామాల భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న సాంస్కృతికకార్యక్రమాలు

గోకుల్ షెడ్ లో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల ప్రాంగణంలో ధనరాజ నటరాజ్ నృత్య సమితి ఎల్బీనగర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 45మంది చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.సంప్రదాయఅమ్మవారికళారూపాలు, చిన్నారులప్రతిభాపాటవాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### భక్తి.. సంప్రదాయం.. ఆధ్యాత్మిక వైభవం

అమ్మవారి దర్శనం, బోనాల సమర్పణలు, భక్తుల పూజలు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ఏడుపాయల క్షేత్రం ఆధ్యాత్మిక కళను సంతరించుకుంది. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న వనదుర్గమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

## ఎన్నికల ముందు హామీలను నేరవేర్చాలి

### ఎన్‌హెచ్ఎస్, ఆయుష్,సర్వశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: మాజీ మంత్రి హరీష్‌రావు




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిందని. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను, ఆయుష్ ఉద్యోగులను, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని, వారి ఉద్యోగాలకు భద్రత కల్పిస్తామని అనేక వాగ్దానాలు ఇచ్చిందని. మూడేండ్లు అయిన హామీల అమలులో ఉద్యోగులు నిరాశకు గురవుతున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల దగ్గరకు వెళ్లినప్పుడు రేవంత్ రెడ్డి ఏమన్నారంటే, మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాయ్ తాగినంత సమయంలోనే మీ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తాం అని హామీ ఇచ్చారు. మరి ఇప్పుడు రేవంత్ రెడ్డి చాయ్ తాగడం లేదా? చాయ్ తాగినప్పుడు సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ గుర్తుకు రావడం లేదా?అధికారంలోకి రాకముందు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ముందు సర్వశిక్ష ఉద్యోగుల సమ్మెకు మాజీ మంత్రి హరీష్‌రావు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు రావాల్సిన ఉద్యోగులకు 15 తేదీ వచ్చినా జీతాలు అందడం లేదు. ఒక్కొక్కసారి రెండు నెలలు, మూడు నెలలు కూడా జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నాం అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి , అదే ప్రభుత్వంలో ప్రజలకు సేవలందిస్తున్న ఎన్‌హెచ్ఎం ,ఆయుష్ ఉద్యోగులకు ఎందుకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం లేదన్నారు? బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల 1 వ తారీఖున జీతాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించారన్నారు. అదేవిధంగా ఆయుష్ ఉద్యోగులు కూడా పల్లె దవాఖానలో ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థలో వారి పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. అలాంటి ఎన్‌హెచ్ఎం, ఆయుష్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్‌హెచ్ఎం, ఆయుష్ ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ కావాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. అర్హత ప్రకారం జిపిఎఫ్, ఇస్ఐ ,ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉద్యోగి విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే, మరణిస్తే అతని కుటుంబానికి బీమా భరోసా ఉండాలని, ఉద్యోగి అనారోగ్యానికి గురైతే వైద్య చికిత్స కోసం ఇఎస్ఐ ఆరోగ్య బీమా సౌకర్యం ఉండాలన్నారు. అదేవిధంగా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు కూడా ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నారని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించి, వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేయాల్సిన బాధ్యత ఆ ప్రభుత్వంపై ఉందన్నారు. మాటలు చెప్పడం కాదని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని . వారికి న్యాయం చేయాలన్నారు. ఎన్‌హెచ్ఎం ,ఆయుష్,ఈజిఎస్ ,సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాం. స్కావెంజర్లు తమ సమస్యల సాధనకు చేస్తున్న సమ్మెకు మాజీ మంత్రి హరీష్‌రావు సంఘీభా వం ప్రకటించారు. స్కావెంజర్ల సమస్యలను జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తానన్నారు. అవసరమైతే అ సెంబ్లీలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మాజీ మంత్రి హరీష్‌రావు హామీనిచ్చారు.

## గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ఉత్సవాలు ప్రతీక

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
### గిరిజన సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జీఎస్సార్..





**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు,ఆచార వ్యవహారాలకు తీజ్ పండుగ ప్రత్యేక గుర్తింపు అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి పట్టణం 19 వ వార్డుతో పాటు కుందూరు పల్లిలో రూరల్ మండలంలోని కమలాపూర్ గ్రామాల్లో గిరిజన సోదర సోదరీమణులు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్న తీజ్ ఉత్సవాల్లో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు,ఆచార వ్యవహారాలకు తీజ్ పండుగ ప్రత్యేక గుర్తింపు అని పేర్కొన్నారు.గిరిజన సోదర సోదరీమణులందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కుందూరు పల్లిలో రూ.10 లక్షలతో నిధులు గిరిజన సోదరుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణం కోసం నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దేవాలయ నిర్మాణానికి అవసరమైతే మరిన్ని నిధులు కూడా కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.గిరిజనుల అభ్యున్నతికి, వారి సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గిరిజన సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## పాలకుర్తి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సృజన్ కుమార్

**ప్రజాపక్షం/పాలకుర్తి:** పాలకుర్తి నూతన ఎస్ఐగా సృజన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన పవన్ కుమార్ ధర్మసాగర్‌కు బదిలీ కావడంతో దేవరుప్పులలో పనిచేసి బదిలీ అయిన సృజన్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రజలందరు సహకరించాలని ఆయన అన్నారు.

## మండల నూతన ఎస్‌హెచ్‌ఒగా బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌వోగా చింత రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కొడకండ్ల మండల ఎస్‌హెచ్ఓగా పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బాధితులకు న్యాయం అందించడం తన ప్రధాన లక్ష్యమని చింత రాజు తెలిపారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యమిస్తానని, ప్రజలు నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

## మహిళలకు చీరల పంపిణీ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ, దసరా పర్వదినం పురస్కరించుకుని పేద మహిళలకు గురువారం చీరల పంపిణి చేశారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ వెనుక నివాసం ఉంటున్న సుమారు 15 మంది మహిళలకు చీరల పంపిణి చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ పండుగ వేల నిరుపేద మహిళలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ట్రస్ట్ ప్రతినిధులు కుమారస్వామి, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## వెల్డింగ్ యూనిట్‌కు అనుమతులు ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** నివాస గృహాల పక్కన శబ్దం, దుమ్ము, పొగతో కాలుష్యం కలిగించే యంత్రాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని తిమ్మంపేట గ్రామస్థులు సర్పంచ్ చాడ కవితారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన గనిముక్కల రాజు ఎలాంటి అనుమతులు లేకుండా శ్రీవెంకటేశ్వర వెల్డింగ్ అండ్ ఇంజనీరింగ్ వర్క్స్ పేరుతో వెల్డింగ్, ఇతర యంత్రాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధిక శబ్దంతో పిల్లల చదువుకు ఆటంకం కలుగుతుందని, వృద్ధులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థలాన్ని పరిశీలించి, ప్రజల అభ్యంతరాలు స్వీకరించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పేదల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యం



**ప్రజాపక్షం/ములుగు:** ప్రజాసేవే ధ్యేయంగా వైద్యం, విద్య, ఉపాధి రంగాల్లో సేవలందిస్తున్న బిఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న ఆధ్వర్యంలో కమలాపూర్‌లో 33వ విడత ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు కంటి పరీక్షలతో పాటు బిపి, షుగర్ పరీక్షలు చేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌లోని శంకర ఆసుపత్రికి తరలించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం స్ఫూర్తితో గత రెండున్నరేళ్లుగా నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉచిత కంటి వైద్య శిభిరాలు నిర్వహిస్తున్నట్లు జంపన్న తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక సహాయం, కంప్యూటర్ శిక్షణ, నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో కంటి వైద్యం చేయించుకోలేని పేదలకు ఈ శిభిరాలు ఎంత ఉపయోగపడుతున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పేదలకు వైద్యం, విద్యార్థులకు విద్య, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని జంపన్న తెలిపారు. రాజకీయాలు పదవులకు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని జంపన్న తెలిపారు. రాజకీయాలు పదవులకే పరిమితం కాకుండా ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు పప్పు వెంకట్ రెడ్డి, నాగ రమేష్, తుక్కని శ్రీనివాస్, సిద్దంశెట్టి లక్ష్మణ రావు, గోస్కుల లక్ష్మి, పంపాన పార్వతి, పగడాల వెంకట్ రెడ్డి, గోమాస చంద్రరావు, డాక్టర్ గుడిసేవ నాగేశ్వరరావు, ఎండి జాంగీర్, ఆకుల ప్రభాకర్, పాషా, జెట్టి లక్ష్మి, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

# రామేశ్వరంలో డాక్టర్ కలాం 95 వ జయంతి వేడుకలు

### కలాం స్వగృహం వద్ద నివాళులర్పించిన గూడూరు అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్



**ప్రజాపక్షం/గూడూరు;** భారత మాజీ రాష్ట్రపతి మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం 95 వ జయంతి వేడుకలను తమిళనాడులోని రామేశ్వరంలో ఘనంగా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రామేశ్వరంలో కలాం స్వగృహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలులర్పించారు.ఈసందర్బంగా అసోసియేషన్ అధ్యక్షులు ముయ్యబోయిన వెంకన్న మాట్లాడుతూ రామేశ్వరంలోని ఓ నిరుపేద కటుంబంలో జన్మించిన కలాం స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి భారత రాష్ట్రపతిగా దేశానికి విశిష్టి సేవలందించడం యావత్ దేశానికి గర్వరారణమని కొనియాడారు. ఆయన జీవితం నేటి యువతకు నిత్యస్ఫూర్తిదాయకమన్నారు. కలాం చూపిన మార్గదర్శకాలను ఆదర్శంగా తీసుకునే తమ వాకర్స్ అసోసియేషన్ కు ఆయన పేరు పెట్టుకున్నామని ఆయన స్వగృహం వద్దే జయంతి వేడుకలను జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని గర్వాన్ని ఇచ్చిందని తెలిపారు. భారత దేశానికి శాస్త్ర సాంకేతిక రంగాలలో కలాం చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీమని పేర్కోన్నారు.ఈకార్యక్రమంలో అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బెజ్జం రమేష్ ఈక లక్ష్మయ్య బత్తుల శ్రీనువాస్ గజ్జి మల్లేష్ పెనుక ప్రభాకర్ సంగుపు బాబు దబ్బగట్ల రమేష్ బొడ ఎల్లయ్య అశోక్ వెంకట్‌రెడ్డి రాజు లక్ష్మీ నారాయణ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు

# 'మనసెందుకో సున్నితం' కవిత సంపుటి సమీక్ష



**ప్రజాపక్షం/ హన్మకొండ టౌన్:** వరంగల్ తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో హన్మకొండలోని శ్రీరాజ రాజ నరేంద్రాంధ్ర భాషా నిలయం కవిత్వంలో కలుద్దాం 25వ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కవయిత్రి బిట్ల అంజనీదేవి రచించిన మనసెందుకో సున్నితం కవితా సంపుటిని డాక్టర్ మామిడాల శైలజ తనదైన శైలిలో సమీక్షను అందించింది. అనంతరం వివిధ అంశాల పై 15 మంది కవులు కవితా పఠనం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షులు పొట్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... కవిత్వం అంటే రకరకాల నిర్వచనాలు ఉన్నప్పటికి ఏదైతే శ్రోతలను ఆకట్టుకుంటుందో జన సామాన్యంలోకి వెళ్తుందో అదే కవిత్వానికి కొలమానమని, అది కవి సొంత ముద్ర కావాలని, ఒకరిలా ఒకరు రాయాలని అనుకోకూడదని అన్నారు. రాయడం అలవాటైనప్పుడు ప్రతి కవిత తన శైలిని నిర్ధేశించుకుంటుందని, నగీశీల శైలి కోసం కవిత్వం రాయకూడదని, రాసే వస్తువు పట్ల నిబద్ధత ఉండాలన్నారు. కార్యదర్శి బిల్ల మహేందర్ మాట్లాడుతూ.. కవిత్వంలో కలుద్దాం కార్యక్రమం ద్వారా కవులకు కవిత్వ నిర్మాణం, శైలి తదితర అంశాల పట్ల అవగాహను పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్తుక రాజు, వలబోజు రాంబ్రహ్మాచారి, వకుకళవాలసు, అనిత, రజిత, ప్రసాద్, ప్రేమ్ కుమార్, జితేందర్, శ్యామ్ సుందర్ రెడ్డి, రాజేందర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# సిసి ప్లాట్‌ఫాం నిర్మాణం ప్రారంభం



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ చెరువు సమీపంలోని బతుకమ్మ ఆట స్థలంలో సిసి ప్లాట్‌ఫాం నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్‌డిఎఫ్) నుండి మంజూరైన నిధులతో చేపడుతునన ఈ పనులను సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ప్రారంభించారు. బతుకమ్మ పండగ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఆటపాటలు నిర్వహించే ఈ స్థలంలో సిసి ప్లాట్‌ఫాం నిర్మాణం పూర్తయితే వారికి మరింత సౌకర్యంగా ఉంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నిధులు కేటాయించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి గ్రామ ప్రజల తరుపున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## జూనియర్ సివిల్ జడ్జీగా సాయి పవన్ ఎన్నిక



**ప్రజాపక్షం/ భీమదేవరపల్లి :** తెలంగాణ హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జీ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పరీక్షలో డి. సాయి పవన్ ఎంపికయ్యారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో ఆయన అర్హత సాధించారు. బిటెక్ పూర్తి చేసిన అనంతరం న్యాయ వ్యవస్థపై ఆసక్తితో ఐఐటి ఖరగ్‌పూర్ లో ఎల్‌ఎల్‌బి హానర్స్ పూర్తి చేశారు. హైకోర్టు హన్మకొండ జిల్లా కోర్టుల్లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ప్రస్తుతం సీనియర్ న్యాయవాది ముద్దసాని సహోదర్ రెడ్డి వద్ద జూనియర్ అడ్వకేట్ గా కొనసాగుతున్నారు. ఇటీవల తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ఏపిపి పరీక్షలో కూడా అర్హత సాధించారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను బుధవారం రాత్రి మహిళలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం 5వ రోజు కార్యక్రమమైన అట్ల బతుకమ్మ సందర్భంగా మహిళలు తీరొక్క రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి వైశ్య సంఘానికి తీసుకురావడం జరిగింది. బతుకమ్మ సంబరాలను జరుపుకున్న అనంతరం అట్లను వాయినంగా ఇచ్చిపుచ్చుకున్నారు. కాగా అందంగా బతుకమ్మలను పేర్చిన మహిళలకు బహుమతులను అందజేయడ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు అంచూరి యుగంధర్, దాంశెట్టి సోమన్న, ఇమ్మడి అశోక్, గందె సోమన్న, బోనగిరి శ్రవణ్ కుమార్, అంచూరి సురేష్, బెలిదె హరిశంకర్, బజ్జూరి సుధీర్, ఇమ్మడి అనిల్, సంతోష్, మహిళా సంఘం ప్రతినిధులు అంచూరి కమల, దాంశెట్టి శ్రావ్య, దొడ్డ ఉమ, తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాకర్లపూడి విక్రాంత్ వర్మ

**ప్రజాపక్షం/వాజేడు:** మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాకర్లపూడి విక్రాంత్ వర్మ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పైడాకుల ఆశోక్ నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా విక్రాంత్ వర్మ మాట్లాడుతూ పార్టీ అధిష్టానానికి దన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంతో పాటు, ప్రభుత్వ సంక్షమ పథకాలను ప్రజలకు వివరిస్తానని తెలిపారు. కాకర్లపూడి విక్రాంత్ వర్మ అధ్యక్షుడిగానియమితులైన సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు.

## మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడి నియామకం



**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగురు):** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా సయ్యద్ హుస్సేన్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పైడాకుల ఆశోక్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పైడాకుల ఆశోక్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ మండలంలో సీనియర్, జూనియర్ తేడా లేకుండా రానున్న ఎంపీటీసి, జడ్పీటీసి ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో అన్ని స్థానాలలో గెలిచేలా సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు.

# సరదాగా డ్రైవింగ్.... శోకసంద్రంలో తల్లిదండ్రులు..

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** మండలంలో పలు గ్రామాలలో వచ్చిపోయే వాహనాలను కన్నాయిగూడెం ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో రోజు వారిగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సరైన వయస్సు అవగాహన శిక్షణ లేని వ్యక్తి చేతిలో ఉన్న వాహనం ఒక ప్రమాదకర ఆయుధం వంటిదే. అది వారితోపాటు ఇతరులకు హాని కల్గించక మానదు. 18 ఏళ్లలోపువారు వాహనాలపై మొజుతో, స్నేహితులతో కలిసి సరదా కోసమె, ఇతరుల మెప్పు కోసమె బండి కనిపిస్తే చాలు ఉరకలేస్తూ... సవారీ చేస్తున్నారు...... దీనివల్ల ప్రమాదాల బారినపడి తమ పాణాలను కోల్పోవడంతోపాటు ఇతరుల ప్రాణాలనూ చిక్కుల్లో పడేస్తున్నారు. కన్న వారి కలలను కలగా మిగిల్చి కానరాని లోకలకు వెళ్లిపోతున్నారు.

**చేతికందిన పిల్లలు శవాలుగా మారుతుంటే...**



పిల్లలు పుట్టి తల్లిదండ్రుల గుండెలపై ఆడుకుని బుడిబు డి అడుగులు వేసింది మొదలు పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అనుక్షణం తాపత్రయ పడుతుంటారు తల్లిదండ్రులు. తమ స్థాయిని మరిచి చదువు లు, తాహతకు మించి పిల్లలు అడిగిందల్లా అందిస్తూ మా బతుకుల్లా పిల్లలు బతకకూడదనే సంకల్పంతో వా రిని ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులను చేద్దామని నిరంతరం శ్రమించి వారి ఆశలను త్యాగాలు చే స్తూ చదువులు చదివించి ప్రయోజకులుగా చూద్దామని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు, అమ్మ బయటకు పోయి వస్తా అని కాసేపటికే శవమై తిరిగి వచ్చిన పిల్లల త ల్లిదండ్రుల బాధా ఊహకందనివి.

**రోడ్డు పైకి వస్తే కేసులు తప్పనిరి : ఎస్ఐ సతీష్**

పాఠశాల, కళాశలలకు వెళ్ళె విద్యార్థులు బైకుల్లో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారని, మైనర్లు కూడా ద్విచక్ర వాహనాల విరివిగా నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారని తనిఖీలలో దొరికితె జరిమానా విధిస్తున్నామని, వారి తల్లి తండ్రులకి కౌన్సిలింగ్ ఇస్తున్నామని, రెండో సారి పట్టు పడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు.

## దశదినకర్మలకు హాజరైన బిఆర్ఎస్ నేతలు



**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు యడ్లపల్లి నరసింహారావు బంధువు గరికపాటి సాంబశివరావు ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందాగా వారి దినకర్మలకు రావలసిందిగా శ్రీ రామకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నాగ రమేష్ ని ఆహ్వానించగా వారి పిలుపు మేరకు కర్మలకు విచ్చేసి సాంబశివరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం అందించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా మహిళ నాయకురాలు కొమరం ధనలక్ష్మి, కోడె రాము, హుస్సేన్, వెంకట్రావు, కొమరం పుల్లారావు, సాంబుల్, సంతోష్ సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు.

## కనకదుర్గ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంలో శ్రీ కనకదుర్గ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మౌటం కుమారస్వామి, గ్రామ ప్రజలు దుర్గాదేవి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గంధసిరి రాజు మాట్లాడుతూ... గ్రామ ప్రజలను అమ్మవారి కృపకి పాత్రులను చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, భోగభాగ్యాలతో సుఖ సంతోషాలతో ప్రజలు జీవించాలని ఆయన అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకి, ప్రజలకి శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ వారి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

జిఎంఎజిఎం

ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్న కంపెనీ స్థాయి లాన్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ టోర్నమెంట్లు గురువారం ప్రారంభమయ్యాయి. భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత కృష్ణ కాలనీ గ్రౌండ్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఒలింపిక్ జెండాను ఆవిష్కరించారు. సింగరేణి సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన సీనియర్ క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం**

సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంతో పాటు క్రీడలకు కూడా ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రామన్ వి. పాఠక్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయికృష్ణ, ఏఐటీయూసీ నాయకుడు మోటపలుకుల రమేష్, ఐఎన్‌టీయూసీ నాయకుడు బి.మధుకర్ రెడ్డి, భూపాలపల్లి సీఎంఓఏఐ అధ్యక్షుడు నజీర్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు, క్రీడా రిఫరీలు, తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవా కేంద్రాలను మూసివేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి ఎల్ రవి




**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మీ సేవా కేంద్రాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఈ డిస్టిక్ మేనేజర్ చర్యలు తీసుకోవాలని స్టూడెంట్స్ ఫడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ములుగు జిల్లా కార్యదర్శి టి ఎల్ రవి డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగపేట మండల కేంద్రంలో కొందరు నిబంధనలను ఉల్లంఘిస్తూ మీ సేవా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. నిర్ణీత దూర నిబంధనలను పాటించకుండా, ఒక గ్రామానికి సంబంధించిన మీ సేవా కేంద్రాన్ని మరో గ్రామానికి మార్చి అనుమతులకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్‌కు సమాచారం ఉన్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న కేంద్రాలపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించే వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందని అన్నారు. ఇప్పటికైనా ములుగు జిల్లా కలెక్టర్ స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తేలిన మీ సేవా కేంద్రాల అనుమతులను నిబంధనల ప్రకారం రద్దు చేసి, అవసరమైన చోట కేంద్రాలను మూసివేయాలని కోరారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు విచారణలో తేలితే సంబంధిత ఈడిస్ట్రిక్ట్ మేనేజర్‌పై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రభుత్వ సేవలు అందేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి ఎల్ రవి ఈ సందర్భంగా కోరారు.

## కలాం ఎక్సలెన్స్ అవార్డుకు పోగు అశోక్ ఎంపిక



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ పోగు అశోక్‌కు అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు లభించింది. మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని గురువారం హన్మకొండలోని రెడ్‌క్రాస్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రధానం చేశారు. డిటిఒ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, అబ్దుల్ కలాం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దేవునూరి ఆనంద్ తదతరులు చేతుల మీదుగా అశోక్ పురస్కారాన్ని అందుకున్నారు. వరంగల్‌లోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అశోక్, విద్యార్థులకు మార్గదర్శనం చేయడంతో పాటు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉచిత కౌన్సిలింగ్ శిభిరాలు, ప్రేరణాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి సేవలందిస్తున్నారు. అశోక్‌ను సెక్టోరియల్ ఆఫీసర్ కట్ల శ్రీనివాస్, సైన్స్ అధికారి సురేష్ బాబు, మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## క్రీడాస్ఫూర్తికి పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం / నల్లబెల్లి :** యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడంలో నర్సంపేట మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని వరంగల్ జిల్లా నల్లబెల్లి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి అన్నారు . గురవారం మండలంలోని రుద్రగూడెం గ్రామ పరిధిలోని పెద్ద తండలో స్నేహ బంజార యూత్ అసోయోషన్ ఆధ్వర్యంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న నర్సంపేట డివిజన్ స్థాయి దసర క్రీడాలను బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి ప్రారంబించారు . ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ నర్సంపేట నియోజక వర్గ అభివృద్ధికి నర్సంపేట మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు . రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో యువత క్రీడలు నిర్వహించేందుకు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారన్నారు . వివిధ ప్రాంతాల నుండి వచ్చే యువత మధ్య పరస్పర స్నేహ బంధం ఐక్యత ఏర్పాడుతుందన్నారు . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి కొత్తపెల్లి కోటిలింగాచారి , మాజీ ఎంపిటిసి నూటెంకి సూరయ్య ,స్నేహబంజార యూత్ అసోయోషన్ బాద్యులు తదితరులు పాల్గొన్నారు .

## ఆటంకాలా...నిర్లక్ష్యమా?

పోలీస్ స్టేషన్ల చుట్టూ నెలల తరబడి

ఫిర్యాదుదారుల ప్రదక్షిణ





**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రజలు పలు రకాల సమస్యల వలన పోలీస్ స్టేషన్‌కు వచ్చి పిటిషన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేస్తే విధి నిర్వహణలో భాగంగా ఆటంకాల లేదా విధుల పట్ల నిర్లక్ష్యమా..! తెలియదు గాని, సమస్యలతో వచ్చిన పిటిషన్‌దారులు నెలల తరబడి పోలీస్‌స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారం కావడం లేదని, చిట్యాల మండల ప్రజలు తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. పోలీసుల దృష్టి లేకపోవడంతో పంచాయతీలు గ్రామాలలో యధావిధిగానే కొనసాగుతున్నాయని, సమస్యలకు పరిష్కార మోక్షం ఎప్పుడోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి దిగుమతవుతున్న ప్రాణాలకు హానికరమైన ప్రాణాంతకమైన గాంజా, డ్రగ్స్, కల్తీ మద్యం మండలంలో విచ్చలవిడిగా రూపాంతరం చెందుతు దినదినభివృద్ధిగా యువతను మహమ్మారిలా ఆవరించి పట్టి పీడిస్తుందని, భయాంకరమైన ఆ మత్తులో చిత్తవుతు..తూగుతున్న యువత అని మండల ప్రజలు వాపోతున్నారు. ఇంత జరుగుతుంటే భద్రతను ఇవ్వాల్సిన పోలీసులు మాత్రం నిర్లక్ష్యం నీడలో నిమ్మకు నీరెత్తినట్లు అంటి ముట్టనట్లు కొంత మేర చూపిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారంటున్నారు. ఈ ప్రాణాంతకమైన గాజా, డ్రగ్స్, కల్తీ మద్యం మహమ్మారిపై ఉక్కుపాదం మోపాలని, లేకుంటే యువత మనుగడకే ప్రమాదమని గ్రామ ప్రజలు వాపోతున్నారు.

**గ్రామాలలో పోలీస్ గస్తీ లేదు..సైరన్ మోతలేదు**

గ్రామాలలో ఎప్పటికప్పుడు పోలీసులు శాంతి భద్రతలను కాపాడడం, నేరాలను అరికట్టడం ప్రజలకు రక్షణ కల్పించడం, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా ఉండే విధంగా చూడాల్సిన పోలీసులు గ్రామాలలో పోలీస్ గస్తీ లేదు పోలీస్ వాహనంతో సైరన్ మోత లేదు. గ్రామాలలో పోలీసుల సందర్శన లేకపోవడమే బహిరంగంగా ఎక్కడపడితే అక్కడ పేకాట స్థావరాలు, అంబరు, గుట్కా యువత ప్రాణాంతకమైన డ్రగ్స్, కల్తీ మద్యం నిషేధిత మాదకద్రవ్యాలను సేవించి అల్లర్లు, దాడులు, క్రైమ్స్‌లు చేయడానికి వెనుకాడడం లేదని, పోకిరీలు పెట్రేగిపోతున్నారని, ఇవన్నీ చూస్తూ ప్రజలు ముఖ్యంగా మహిళలు, బయట అడుగు పెట్టడానికి జంకుతున్నామంటున్నారు.

# సింగరేణి బొగ్గు బావుల్లో దుర్గామాత నవరాత్రి పూజలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి వన్ ఇంక్లైన్, సిక్స్ ఇంక్లైన్ బొగ్గు బావుల్లో గురువారం దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో భూపాలపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలకు మంచి జరగాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు లభించాలని, వారు తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యం కలగాలని, సింగరేణి ప్రాంతంలో సుఖశాంతులు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు, సింగరేణి కార్మికులకు దుర్గామాత నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, ఐఎన్‌టియుసి నాయకులు, సింగరేణి అధికారులు, కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుకర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సద్దుల బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/ కొండపాక :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా నేడు మండల కేంద్రమైన కొండపాకతో పాటు దమ్మకపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. అనాదికాలంగా వస్తున్న ఆచారం ప్రకారం కొండపాక గ్రామంలో ఏడవ రోజునే సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. గ్రామ చరిత్ర, పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాల నేపథ్యంలో కొండపాకలో ఏడవ రోజు సద్దుల బతుకమ్మను నిర్వహించడం ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఆటపాటలతో సంబరాలు జరుపుకోనున్నారు. బతుకమ్మలను నిమజ్జనం చేసి గౌరమ్మకు పూజలు నిర్వహించనున్నారు. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొనడంతో మహిళలు, యువతులు సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ తెలంగాణ సంస్కృతి, ఆచారాలను కాపాడుకుంటున్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ప్రపంచంలో పూలతో జరుపుకునే అరుదైన పండుగ బతుకమ్మ అని తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు సాంస్కృతిక వైభవానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టరేట్ రెవెన్యూ శాఖ ఆద్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అదనపు కలెక్టర్ సంగీత పాల్గొని బతుకమ్మ పూజకార్యక్రమాలు నిర్వహించి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో ఆనందోత్సావాల మద్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. బతుకమ్మ తెలంగాణ ఇంటి మహాలక్ష్మి గా భావిస్తారని పేర్కొన్నారు. కలెక్టరేట్ లో ప్రాంగణంలో నేటి నుండి అక్టోబర్ 17 వ తేది వరకు ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుంచి బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు ,యువత మహిళా ఉద్యోగులు ,మహిళలు కలెక్టరేట్ చుట్టుపక్కల గల కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.శాఖల వారీగా బతుకమ్మ సంబురాల నిర్వహణకు రోజువారీ షెడ్యూల్‌ను రూపొందించడం జరిగింది. వివిద శాఖలతో బతుకమ్మ సంబురాలు,ఈ నెల 17 వరకు కలెక్టరేట్ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ,మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.

# మర్పడగ క్షేత్రంలో హరీష్ రావు పూజలు

**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండలం మర్పడగ విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రాన్ని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీష్ రావు గురువారం సాయంత్రం దర్శించారు. క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హరీష్ రావు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో సమస్త లోకాలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలతో వర్ధిల్లాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఈ సందర్భంగా క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాధ శర్మ హరీష్ రావుకు స్వాగతం పలికి పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో శేష వస్త్రంతో హరీష్ రావును సత్కరించారు. ఆయన వెంట గజ్వేల్ బిఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాపరెడ్డి, రాజనర్సు, సంపత్ రెడ్డి అనంతుల ప్రశాంత్, నూనె కుమార్, రాగల దుర్గయ్య, నరసింహారెడ్డి గ్రామ సర్పంచ్ ఆకారం బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలోని పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణం కోసం హరీష్ రావు కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# ఎలినినో ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/పాపన్నపేట :** కరోన వంటి విపత్కర పరిస్తితులను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమర్థంగా ఎదుర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎలిని నో ఎదుర్కునేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఏడుపాయల క్షేత్రంలో అమ్మవారికి బోనం సమర్పించిన అనంతరం ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, కరీంనగర్ మాజీ జెడ్పి చైర్ పర్సన్ తుల ఉమా, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా నేతలతో కలిసి ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి విద్యుత్ ఎంతో కీలకమని, రైతులకు విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించే జ్ఞానాన్ని ప్రభుత్వానికి అమ్మవారి ప్రసాదించాలన్నారు. పంట ఎండిపోయి రైతన్నలు కన్నీరు పెడుతున్నారన్నారు. చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. అధికారంలోకి రాగానే



24 గంటల కరెంటు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు నాణ్యమైన విద్యుత్ రైతులకు ఎందుకు అందజేయడం లేదో తెలియజేయలన్నారు. ప్రభుత్వం పట్టించుకోని రైతులకు నాణ్యమైన విద్యుత్ తో పాటు రైతుబంధు రైతు భీమా అందజేయాలని డిమాండ్ చేశారు. వీరి వెంట పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షులు జగన్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, శ్రీనాథ్ రావు, సంజీవరెడ్డి, నాయకులు సాయి రెడ్డి, నాగ్సన్‌పల్లి శ్రీనివాస్ గౌడ్, అనిల్ రెడ్డి, మల్లేశం, రఘు, సంజీవులు ఏడుపాయల మాజీ డైరెక్టర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

# విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ ముందుచూపులేని నిర్ణయాలు, సరైన ప్రణాళిక లేకపోవడమే కారణమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సాగునీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడం వల్లే బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ సరఫరాపై ప్రభావం పడుతోందని ఆయన ఆరోపించారు. బకాయిలను వెంటనే చెల్లించి బొగ్గు ఉత్పత్తిని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి చెల్పూర్ జెన్‌కో విద్యుత్ కేంద్రంలో సుమారు 1,100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థం ఉండగా, ప్రస్తుతం 400 నుంచి 600 మెగావాట్ల మేర మాత్రమే ఉత్పత్తి జరుగుతోందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించామని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మోటార్లు పనిచేయక, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరి పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ అంతరాయాలు కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల పథకానికి కూడా నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. విద్యుత్ కొరతను ముందుగానే అంచనా వేసి, అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేయాలని సూచించారు. అధికారులపై చర్యలు తీసుకోవడం కంటే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు.

**రైతుల పంటలను కాపాడాలి**

ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని గండ్ర వెంకట రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. చేతులు జోడించి కోరుతున్నాను. రాష్ట్ర ప్రజలను, రైతులను కరువు పరిస్థితుల నుంచి కాపాడండి. విద్యుత్ సమస్యలను పరిష్కరించకపోతే రైతుల పక్షాన మరోసారి ఉద్యమిస్తాం అని హెచ్చరించారు. ఈ సమావేశంలో సమావేశంలో పట్టణ మాజీ అధ్యక్షుడు కటకం జనార్ధన్, బిఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ గండ్ర హరీష్ రెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు బడి తల సమ్మయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గాజర్ల అశోక్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాల-పల్లి :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గురువారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా అశోక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నిమ్స్ వైద్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, గాజర్ల అశోక్‌కు మెరుగైన వైద్య సేవలు అందించి, త్వరగా కోలుకునేలా తగిన చికిత్స అందించాలని కోరారు. అశోక్ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. అనారోగ్య సమయంలో అధైర్యపడకుండా మనోధైర్యంతో ఉండాలని భరోసా కల్పించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకుడైన గాజర్ల అశోక్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చెల్పూర్ పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కేటీఆర్ కోసం... ఎదురుచూస్తున్న మల్లన్న సాగర్ నిర్వాసితులు...?



**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ కు కేటీఆర్ వస్తానని చెప్పడం శుభ పరిణామం కాగా, ఆయన మొదటగా మల్లన్న సాగర్ నిర్వాసితుల తలుపు తట్టాలని టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కెసిఆర్ గజ్వేల్ వస్తానని చాలా సార్లు చెప్పగా, ఆ పదం వారికి ఊతపదంగా మారిందని ఎద్దేవా చేశారు. కాగా ప్రస్తుతం కేటీఆర్ కూడా గజ్వేల్ వస్తానని, ఒకరోజు గడుపుతానని అనడంతో ఇక్కడి ప్రజలు ఆయన కోసం ఎదురుచూసే పరిస్థితి వచ్చిందని, అప్పుడైనా కెసిఆర్ హయాం నుండి ఉన్న సమస్యలు కొడుకు కేటీఆర్ తో పరిష్కారం అవుతాయని అన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో సర్వం కోల్పోయిన మల్లన్న సాగర్ భూ నిర్వాసితులు కేటీఆర్ కు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమని, ఇందుకు తాము కూడా స్వాగతిస్తామని చెప్పారు. నిర్వాసిత గ్రామాల ప్రజల్లో ఎన్నో ఆశలు లేపి ఇక్కడికి తరలించగా, వారు దిక్కులేనివారుగా బ్రతుకు వెళ్లదీస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేగా ఇక్కడి ప్రజలు కేసీఆర్ ను నమ్మి ఓటేసిన పాపానికి ఆయన ఎర్రవల్లి ఫామ్ హౌజ్ కే పరిమితం కాగా, ప్రతిపక్ష నేతగా, కేబినెట్ ర్యాంకుతో సకల సదుపాయాలు అనుభవిస్తున్న ఆయన ఇప్పటికైనా ప్రజల మధ్యకు రావాలని డిమాండ్ చేశారు. ఇలా తండ్రి కొడుకులు గజ్వేల్ ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని, లేని పక్షంలో తామే ఎర్రవల్లికి తరలివెల్లి గజ్వేల్ ప్రజల సమస్యలు చెబుతామని వివరించారు.

# రిమ్మనగూడ - బూరుగుపల్లి రోడ్డుపై గుంటూర్ పూడ్చివేత



**ప్రజాపక్షం/గజ్వేల్ :** రిమ్మనగూడ నుండి బూరుగుపల్లి వెళ్ళే రోడ్డు గుంతలమయమై గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గుంతల వల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, విద్యార్థులు, వృద్ధులు ప్రయాణించడం కష్టంగా మారింది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పాలకవర్గం ముందుకు వచ్చి రోడ్డుపై ఉన్న గుంతలను కాంక్రీట్‌తో పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రజల భద్రత, సౌకర్యమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి కెనాల్ బ్రిడ్జి వద్ద, రోడ్డును శాశ్వతంగా మరమ్మత్తులు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్ రెడ్డి, నాయకులు రాజు, భాస్కర్ రెడ్డి, రజినీకాంత్, కిరణ్, అరవింద్ రెడ్డి, స్వామి, సాయిలు, నర్సింలు, శివులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం ఉన్నా పట్టించుకోని విద్యుత్ అధికారులు.!



ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట మండలం తిప్పనగుల్ల గ్రామంలో అంబేద్కర్ విగ్రహం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. నాలుగైదు రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొగలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగి ఉండటం, ముఖ్యంగా పిల్లలు ఆడుకునే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి, రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## లలిత త్రిపుర సుందరి స్వరూపిణీ గా విజయదుర్గ దేవి



ప్రజాపక్షం/కొండ-పాక : కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లలిత త్రిపుర సుందరి స్వరూపిణిగా విజయ దుర్గా దేవి భక్తులకు దర్శనం ఇచ్చింది. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పేల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి.

## రైతు కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం శంకర్‌తండా గ్రామానికి చెందిన గిరిజన రైతు మాలోత్ శంకర్ (48) ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపిందని ఈ ఘటనపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత గిరిజన కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని భీమ్లతండా పంచాయతీ పరిధిలోని శంకర్ తండాలో ఆత్మహత్య చేసుకొని మృతిచెందిన రైతు కుటుంబాన్ని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి, జిల్లా కోశాధికారి ఆంజనేఉలుగౌడ్, అశోక్ సాదులతో కలసి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టపడి దేశానికి అన్నంపెట్టే రైతు కేవలం మోటరు కాలిపోయిందన్న బాధతో ఆత్మహత్య చేసుకోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని కనీసం 10 గంటల విద్యుత్ ఇవ్వలేని ఆంగ్రెస్ నాయకుల మాటలు కోటలుదాటుతున్నాయని ఆయన అన్నారు. మృతుడు మాలోత్ శంకర్‌కు భార్య, ఒక ఒడుకు, ఒ కూతురు ఉన్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, రైతు ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోకపోతే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని ఎంపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎరుకల భిక్షపతి, మామిడి నర్సారెడ్డి, గోప్యనాయక్, దుబ్బ శేఖర్, విఠల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగులు ఆర్థికంగా సామాజికంగా ఎదుగాలి



ప్రజాపక్షం/రామాయంపేట: దివ్యాంగులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెంది ఆత్మగౌరవంతో కూడిన జీవనం సాగించేలా సమాజంలో ప్రతి ఒక్కరు సహకరించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని 76వ సామాజిక అధికారిత శిబిరంలో ఆర్‌వివై, ఏడిఐపి పథకాల కింద అలిమ్కో సంస్థ అందించిన ఉచిత సహాయ పరికరాలను ఎంపీ రఘునందన్‌రావు మెహెర్ సాయి ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో 367 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఎలక్ట్రానిక్ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా వారికి అవసరమైన సహాయ పరికరాలను అందించడం జరుగుతుందన్నారు. దివ్యాంగుల సంక్షేమం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా, స్థానిక ప్రజాప్రతినిదులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ముందుకు రావాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగులు సమాజంలో గౌరవ ప్రదమైన స్థానం సంపాదించుకునేలా వారిని ప్రోత్సహించాలని, వారి అవసరాలను గుర్తించి తగిన సహాయం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఆయన ఖండించారు. ఎక్కడ ఒక్క ఓటు కూడా పోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వంత ఊర్లో కూడా పోలేదని కావాలంటే తాము ఈవిషయమై ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తామని సవాలు చేశారు. రైతులను కరెంటు ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. అదనపు ఓట్లు, మరణించిన వారి ఓట్లు మాత్రమే తొలగించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అద్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, పబ్బ సత్యనారాయణ, అవినాష్‌రెడ్డి, కౌన్సిలర్ శంకర్‌గౌడ్, వెల్మల సిద్దరాములు, జిల్లా ప్రదాన కార్యదర్శి శ్రీనివాస్, ఎస్‌సి మోర్చా అద్యక్షులు బాల్‌రాజు, సర్పంచులు ప్రవీణ్, శైలజ శ్రీనివాస్, నవీన్‌గౌడ్, బాను చందర్, అనంతలక్ష్మి, నవాత్ రాజు, ఎల్లం, దయానంద్, సంగయ్య, కన్నయ్య, లావణ్య, శేఖర్, స్వామితో పాటు తదితరులు ఉన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలి




ప్రజాపక్షం / మెదక్ : జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలందించిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలు మరువలేనివని అన్నారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగులకు ఐదు శాతం వార్షిక ఇంక్రిమెంట్, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్, మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదన్నారు. అనంతరం ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా మాట్లాడుతూ, కరోనా విపత్కర పరిస్థితుల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, పలువురు కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రజాపక్షం/కొండపాక : కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం క్షేత్రంలో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి 105 కిలోల వందలాది మంది మహిళలు ఓడిబియ్యం సమర్పించారు. క్షేత్ర నిర్వాహకులు హరినాథ్ శర్మ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి విశేష పంచామృత ఫలరస అభిషేకం, చతుష్షష్టి ఉపచార పూజ, నవావరణ హవనం కుంకుమపూజలు తదితర కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. విజయ దుర్గ మాత ట్రస్ట్ ఆధ్వర్యంలో గజ్వేల్ కు చెందిన కళాకారులు నాట్య ప్రదర్శన ఇచ్చారు. వారికి నిర్వాహకులు జ్ఞాపికను అందజేసి ఆశీర్వదించారు.

## తెలంగాణ ప్రజలకు వర్గల్ క్షేత్రం ఆశీర్వాదం



ప్రజాపక్షం/గజ్వేల్ : శ్రీ విద్యాధరి క్షేత్ర నిర్వహణ అద్భుతమని మాజీ ఎంపీ, డాక్టర్ రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రాన్ని గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన దర్శించుకోవడంతోపాటు మనవడికి అక్షర స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవి శరన్నవరాత్ర పర్వదినాల్లో అమ్మవారిని దర్శించుకోవాలనే సంకల్పం నెరవేరిందని పేర్కొన్నారు. కంచి స్వామి ఆశీస్సులతో చక్కటి నిర్వహణ ఉన్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా పండితుల పూజాది కార్యక్రమాలు, తన మనవడికి అక్షరాభ్యాసం చేయడం సంతృప్తి కలిగించిందని అన్నారు. తెలంగాణ ప్రజలకు వర్గల్ క్షేత్రం ఆశీర్వాదం కావాలని, భక్తులకు సకల సదుపాయాలు కల్పిస్తూ ఉన్నత పుణ్యక్షేత్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. అక్షరాభ్యాసం చేసుకున్న చిన్నారులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని, ప్రతి ఒక్కరిపై అమ్మ చల్లని చూపు ఉండాలని వివరించారు. కాగా మొదటగా క్షేత్రంలో ఎంపీ రంజిత్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, వారిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## డంపింగ్ యార్డును తలపిస్తున్న గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్



ప్రజాపక్షం/గజ్వేల్ : గజ్వేల్ సమీకృత మార్కెట్ సముదాయం డంపింగ్ యార్డ్ ను తలపిస్తోందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను గురువారం మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్ తో కలిసి సందర్శించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటని నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యంతో చెత్తాచెదారం, కుళ్ళిన కూరగాయలు, పూలు, ప్లాస్టిక్, మాంసపు వ్యర్థాలతో నిండి కంపు కొడుతున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. రూ వేల కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి గజ్వేల్ ఖ్యాతిని కెసిఆర్ ఇనుమడింప చేయగా, వాటిని సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ సర్కార్ పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఎద్దేవా చేశారు. పండగ పూట సిబ్బందిని పస్తులుంచడం కాకుండా, వారికి బకాయపడిన ఆరు నెలల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యంత్రాంగం మభ్యపెట్టే మాటలు కాకుండా వెంటనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను శుభ్రం చేయాలని, లేనిపక్షంలో ఊరుకునేది లేదని హెచ్చరించారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన శుభ్రతతో కూడిన కూరగాయలు, పండ్లు, మాంసం తదితర అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్ పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు, నేతలు శ్రీనివాస్ గుప్త, స్వామి, అహ్మద్, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే గ్రంథాలయాన్ని నూతన భవనంలోకి మార్చుతాం



ప్రజాపక్షం/గజ్వేల్: వర్గల్ గ్రంథాలయాన్ని నూతన భవనంలోకి త్వరలోనే తరలిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం పేర్కొన్నారు. గురువారం గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేయడంతో పాటు నెలకొన్న సమస్యలను లైబ్రేరియన్ శ్రీనివాస్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు అవసరమైన ఫర్నిచర్, కొత్త పుస్తకాలు తదితర సమకూర్చుతామని స్పష్టం చేశారు. మొదటగా ఆయన నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మోహన్, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, నేతలు అరవింద్ రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, పసుల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళ సమాఖ్య ఆద్వర్యంలో బతుకమ్మ సంబరాలు



ప్రజాపక్షం /సం-గారెడ్డి : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు కాపాడుకుంటూనే రాష్ట్రంలో మహిళలందరు పాల్గొనే ఏకైక పండుగ బతుకమ్మ పండగని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మి అన్నారు. బుధవారం సదాశివపేట మండల పరిదిలోని గొల్ల గూడెం లో మహిళ సమాఖ్య ఆద్వర్యంలో బతుకమ్మ పండగను నిర్వహించారు. ఈ సందర్బంగా ఆర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుకొని చిన్న పిల్లల నుండి వృద్దుల వరకు మహిళలు ఘనంగా ఆడుకునే పండగ బతుకమ్మ అని పేర్కొన్నారు. ఈ కార్యకర్మంలో ప్రభావతి శ్వేత ,సుమలత , స్వరూప సునీత ,మంజుల ,మాణెమ్మ, అనిత ,లక్ష్మి కృష్ణవేణి ,అనుశ్రీ, రుతిక తదితరులు పాల్గొన్నారు.